కథ

# వ్యసనం

''ఎంత?''

''...''

''పోయిందెంత?''

ఈసారి కూడా అతడు బదులివ్వలేదు. నిస్తేజంగా శూన్యంలోకి చూస్తూ ఉన్నాడు. ముఖంలో కళాకాంతులు ఏమాత్రం లేవు. అతడు నిజంగా బాధపడుతున్నాడో లేక పశ్చాత్తాప పడుతున్నాడో తెలీదు కాని. అతణ్ణిలా చూడడం నాకు కొత్తకాదు. అందుకే అతడి పరిస్థితి నాకేమీ ప్రత్యేకంగా అన్పించలేదు.

'ఢడేల్'మంటూ టేబుల్పై పెట్టిన నీళ్ళగ్లాసుల శబ్దానికి అతడు ఉలిక్కిపడి ఈలోకంలోకొచ్చి సర్వర్ వంక చిరాగ్గా చూసాడు.

నేను రెండు టీలు ఆర్డరిచ్చి మళ్ళీ అడిగాను.

''చెప్పు శాస్త్రీ...ఎంత పోయింది?''

అతడు వెంటనే మాట్లాడలేదు. ఆ తర్వాత నెమ్మదిగా చెప్పాడు.

''ఎనిమిది వేల పైనే..!''

''అంటే..ఈనెల జీతం మొత్తం..?''

''అవును''

నాకు చిరాకెత్తుకొచ్చింది. అసలు ఈ మనిషి ఎప్పటికీ మారతాడు? ఈరోజే కాలేజ్లో మా అందరితోపాటు అతడూ జీతం అందుకున్నాడు. కానీ సాయంత్రానికల్లా అంతా పోగొట్టుకున్నాడు. నెలరోజుల శ్రమఫలితమంతా ఒక్కరోజులో ఊడ్చిపెట్టాడు ప్రతిసారీ అతడి ఆశల్ని వమ్ముచేసే ఆ గుర్రాలను నమ్ముకొని.

రెండు కప్పుల్లో టీ తీసుకొచ్చాడు సర్వర్. టీ తాగుతూ కాసేపు ఏమీ మాట్లాడుకోలేదు. ఆ తర్వాత అడిగాను.

''ఇంటికెళ్ళాక జీతం గురించి మీ ఆవిడ అడిగితే ఏం చెప్తావ్?''

''...మామూలే! సిటీబస్లో ఏ దొంగో జేబు కొట్టేసాడని!''

ఎంత తేలిగ్గా చెప్పాడు! బహుశా ఆ సమాధానం కోసం అతడు ముందుగా ఆలోచించి కూడా ఉండడు. అయినా, ఆలోచించడానికేముందీ...ప్రతిసారీ చెప్పీ చెప్పీ అలవాటైపోయిన అబద్ధం కదా! వాళ్ళావిడకు తెలుసు. అతడు చెప్పేది నిజం కాదనీ, డబ్బంతా గుర్రపు పందేలకీ తగలేసాడనీ! కానీ..ఏం చేయగలదు? అతడు మారడని ఆమెకీ తెలుసు.

''ఒకటడుగుతాను ఫ్రాంక్గా చెప్పు. మొదట్నుంచీ ఈరోజువరకు ఈ గుర్రాలపై ఎంత డబ్బు పోగొట్టుకుని వుంటావ్?'' అతడిపై నాకు పీకలదాకా వస్తున్న కోపాన్ని అణచుకుంటూ కూల్గా అడిగాను.

''ప్రతిసారీ డబ్బు పోగొట్టుకోలేదు. అప్పుడప్పుడు గెలిచాను కూడా!'' ఉక్రోషంగా అన్నాడు.

''సరె..సరె..!'' లాభనష్టాలు బేరీజు వేసి ఇప్పటివరకు నెట్ ఎమౌంట్ ఎంత ఖర్చుపెట్టావో చెప్పు.''

''ఇప్పుడెందుకా విషయం?'' విసుగ్గా అన్నాడు.

''చెప్పు..చెప్తాను''

''ఊ...సరిగ్గా గుర్తులేదు. సుమారు ఐదారు లక్షల దాకా వుంటుంది. అయినా..మిగతావాళ్ళతో పోల్చుకుంటే నేను పోగొట్టుకున్నది చాలా తక్కువ తెలుసా?'' తనని తాను సమర్ధించుకుంటున్నట్లుగా అన్నాడు.

అతడిపై నాకు కోపం కలగట్లేదు. నిశితంగా గమనిస్తే..మనిషి తన నుంచి తాను ఎంతగా 'ఎస్కేప్' అవగలడో అతడిలో కనిపిస్తుంది.

''చూడు శాస్త్రీ..మనకు కలిగిన కష్టాన్నీ, జరిగిన నష్టాన్నీ పక్కవాళ్ళతో పోల్చి చూసుకొని వాళ్ళకంటే మనకు జరిగింది తక్కువే అని సమాధానపడటం గొప్ప విషయమే కాని..అది అన్వయించుకోవాల్సింది ఇలాంటి విషయాల్లో కాదు''

అతడు మాట్లాడలేదు.

నేను చెప్పసాగాను.

''నువ్వెప్పుడైనా ఆలోచించావా..నువ్వూ, నేనూ ఒకేసారి ఉద్యోగంలో చేరాం. ఒకేసారి సంపాదన మొదలుపెట్టాం. కానీ..ఇన్నేళ్ళలో నేను స్థలం కొన్నాను, ఇల్లు కట్టించాను. నా పిల్లల భవిష్యత్కి ఢోకా లేకుండా వాళ్ళపేర ఫిక్స్డ్ డిపాజిట్లు కూడా చేసాను. మరి నువ్వు?...నేను నిన్ను కించపరచటం కాని, దెప్పిపొడవడం కానీ చేయట్లేదు. ఒక స్నేహితుడిగా నీతో నాకున్న చనువుతో అంటున్నాను. నిజం చెప్పాలంటే మన కాలేజ్లో అందరికంటే మంచి లెక్చరర్వన్న పేరు నీకుంది. నీ దగ్గర చదివిన స్టూడెంట్స్ చాలామంది ఈరోజు ఎంతో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. కేవలం నీ దగ్గర చదవటం కోసమే మన కాలేజ్లో అడ్మిషన్ తీసుకునే స్టూడెంట్స్ వున్నారంటే అతిశయోక్తేమీ కాదు. ఇంత వర్త్ వున్న నువ్వు ఈ గుర్రప్పందేల జూదంలో పడి...''

''గుర్రప్పందేలేమీ జూదం కాదు. చెస్, బాక్సింగులాగా ఇది కూడా ఒక ఆట. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు కూడా డిక్లేర్ చేసింది'' నా మాటలకి అడ్డు తగులుతూ పౌరుషంగా అన్నాడు.

నాకు ఏమనాలో తెలీలేదు. అతడు చెప్పింది నిజమే! గుర్రపు పందేలు జూదం కాదనీ, వీటిలో విజయం పొందాలంటే ఎంతో అవగాహన నైపుణ్యం ఉండాలనీ, కాబట్టి ఇది కూడా ఒక క్రీడేననీ, క్రీడను ఎప్పటికీ జూదంగా పరిగణించి రద్దుచేయకూడదని రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలలో సైతం వుందని తెలుపుతూ గుర్రపు పందేలని నిషేధించాలని ప్రయత్నించిన తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్రితం సంవత్సరమే సుప్రీంకోర్టు 'చారిత్రాత్మకమైన' తీర్పిచ్చింది. దాంతో మా శాస్త్రిలాంటి ఎంతోమంది ఏంటర్లు (రేసులలో పాల్గొనేవారు) సంతోషించటమే కాదు. మరింత రెచ్చిపోయారు.

''సరే...నీవన్నట్లుగా ఇది జూదం కాకపోవచ్చు. కానీ వ్యసనం, డబ్బు పీల్చేసే ఒక వ్యసనం. అవునా? జీతం డబ్బు చేతిలో పడీ పడగానే వెళ్ళి ఆడటం, అంతా పోగొట్టుకొని వచ్చి యిలా డీలాపడటం, మర్నాటినుంచీ అప్పులు చేయటం, అప్పు పుట్టనప్పుడు ఆడలేకపోతున్నానే అని మధనపడటం..ప్రతినెలా జరిగేదిదే! డబ్బుతోపాటు పదిమందిలో పరువు కూడా పోతోందని తెలిసీ ఈ వ్యసనాన్నెందుకు వదిలించుకోవు?''

నాలో అసహనం పెరిగిపోతోంది. కాస్త ఊపిరి పీల్చుకొని మళ్ళీ చెప్పసాగాను.

''...ఇన్నేళ్ళ సర్వీసున్నా నువ్వింకా సొంత ఇల్లు ఏర్పరచుకోకుండా అద్దె ఇంట్లోనే కాపురముండడానికి కారణమేమిటి? పార్ట్టైమ్ లెక్చరర్లు కూడా టూవీలర్లు మెయిన్టెయిన్ చేస్తున్న ఈరోజుల్లో నువ్వింకా సిటీబస్సుల్లోనే తిరగాల్సిరావడానికి రీజనేమిటి? మీ ఆవిడ కూడా జాబ్ చేస్తోంది

**''ఒక్కసారి ఆలోచించు శాస్త్రీ..! నువ్వీ వ్యసనాన్ని వదిలేయగలిగితే ప్రతినెలా నీకొచ్చే జీతంతో ఎంత ఆనందమైన జీవితం గడపొచ్చో! నీ భార్యాపిల్లల అవసరాల్నీ, ఆనందాల్నీ, సరదాల్నీ ఎన్నింటిని తీర్చుకోవచ్చో ఒక్కసారి ఆలోచించు. అసలు అప్పు చేయాల్సిన అవసరమే నీకు రాదు. అవునా? ఇప్పటివరకు జరిగిందేదో జరిగిపోయింది. ఇకనైనా ఆ వ్యసనాన్ని వదిలేయి. వచ్చేనెలనుంచైనా నీ జీతాన్ని పూర్తిగా నీ కుటుంబం కోసం ఖర్చుచేయి. అసలైన ఆనందమేమిటో అప్పుడు తెలుస్తుంది నీకు''**



కాబట్టి ఆమె సంపాదనపైనే నీ సంసారం ఏదో గుట్టుగా సాగుతోందే తప్ప, లేకుంటే పరిస్థితి ఎలా ఉండేది? నువ్వే చెప్పు..నీకు వ్యసనమే లేకుంటే నువ్వెంతో డబ్బు వెనకేసి ఉండేవాడివి! ఎంతో దర్జాగా జీవించేవాడివి. అవునా!''

అతడు మాట్లాడలేదు.

నేను ఆపదలుచుకోలేదు. చెప్పదలుచుకున్న చివరి మాటలు కూడా చెప్పి పూర్తిచేయాలనుకున్నాను.

''ఒక్కసారి ఆలోచించు శాస్త్రీ..! నువ్వీ వ్యసనాన్ని వదిలేయుగలిగితే ప్రతినెలా నీకొచ్చే జీతంతో ఎంత ఆనందమైన జీవితం గడపొచ్చో! నీ భార్యాపిల్లల అవసరాల్నీ, ఆనందాల్నీ, సరదాల్నీ ఎన్నింటిని తీర్చుకోవచ్చో ఒక్కసారి ఆలోచించు. అసలు అప్పు చేయాల్సిన అవసరమే నీకు రాదు. అవునా? ఇప్పటివరకు జరిగిందేదో జరిగిపోయింది. ఇకనైనా ఆ వ్యసనాన్ని వదిలేయి. వచ్చేనెలనుంచైనా నీ జీతాన్ని పూర్తిగా నీ కుటుంబం కోసం ఖర్చుచేయి. అసలైన ఆనందమేమిటో అప్పుడు తెలుస్తుంది నీకు'' అంటూ నా లెక్చర్ ముగించి-''అన్నట్టు..బస్‌పాస్ కోసం రెండొందలు అప్పడిగావ్ కదూ! ఇదిగో..'' అంటూ పర్సులోంచి రెండు వంద నోట్లు తీసివ్వబోతుండగా, అతడేదో పోగొట్టుకున్నట్లు తన జేబులూ, టేబులు కింద, చుట్టుప్రక్కలా వెతుకుతూండటం గమనించి అడిగాను.

''ఏం వెతుకుతున్నావ్?''

''పెన్ను''.

''ఎక్కడ పోయింది? ఇక్కడేనా?''

''కాదు. ఇందాక మనం హోటల్లోకి వచ్చేటప్పుడు జేబులోంచి కళ్ళజోడు తీస్తుండగా రోడ్డుమీద పడిపోయింది.''

''మరి అక్కడ పోగొట్టుకుంటే ఇక్కడెందుకు వెతుకుతున్నావ్?''

అతడు వెతకటం ఆపి, నా చేతిలోని డబ్బు తీసుకొని జేబులో పెట్టుకొని, వేదాంత ధోరణిలో నవ్వుతూ అన్నాడు.

''...నేను చేస్తున్నదదే! నా డబ్బెక్కడ పోగొట్టుకున్నానో అక్కడే వెతుక్కుంటున్నాను. మీ అందరికీ అది జూదం లాగానో, వ్యసనం లాగానో కన్పిస్తోంది. అంతే!''

యస్వీ కృష్ణ

☆